క్లుప్తంగా

ఓటరు తుది జాబితా పూర్తి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

పెనుకొండ: దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి ఓటరు జాబితాలో నమోదు చేసినట్లు సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ఫైనల్ పబ్లికేషన్ పూర్తయిందని చెప్పారు. ఏఈఆర్‌ఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన

మడకశిర: పట్టణంలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఎస్ఎస్ఏ జిల్లా అలెస్కో, ఐఈడీ అధికారి ఆనందబాబు సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పరిస్థితిపై ఆరా తీశారు. అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దివ్యాంగులకు ప్రభుత్వ సేవలను పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు.

జూదరుల అరెస్ట్


ద్విచక్ర వాహనాలు, నగదు చూపుతున్న పోలీసులు

మడకశిర: పట్టణ పరిధిలోని చీపులేటి వద్ద సోమవారం జూద కేంద్రంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,600 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వీరభద్రుని సేవలో శచీంద్రకుమార్

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్ర స్వామిని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ప్రధాన అధికారి, నార్త్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శచీంద్రకుమార్ పట్నాయక్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. డివిజనల్ పంచాయితీ అధికారి శివనారాయణరెడ్డి, ఈఓఆర్డీ శివన్న, పంచాయితీ కార్యదర్శి ప్రకాష్ వారి వెంట ఉన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి



నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పని చేద్దామని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. ఆయన సోమవారం రాత్రి పట్టణంలోని ఓ హోటల్‌లో మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయమన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని తెలిపారు. 25 పార్లమెంట్ స్థానాలను కూడా కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి కష్టపడి పని చేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెర 127, 128 పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంఈఓ శ్రీధర్ తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రెండు, మూడు రోజుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో వేణురెడ్డి

హిందూపురం: హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో సోమవారం టీడీపీ, బీజేపీ నుంచి మెయిన్ బజారు, 25వ వార్డుకు చెందిన దాదాపు 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మానంపల్లి ఆదర్శ్, బాలాజీ, నగేష్, ప్రేమ్, సేహెల్, జయరాం, సాగర్, తుకారం, ఏసుదాస్, పృథ్వీరాజ్, బావర్ విరాట్, హబీబ్, మణి, సిద్ధార్థ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

జగదభి రాముడికి జేజేలు !

- అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆలయాల్లో పూజలు
- పలు ప్రాంతాల్లో శ్రీరాముడి చిత్రపటం ఊరేగింపు
- పెద్ద ఎత్తున అన్నదానం, పానకం పంపిణీ

సాక్షిబృందం: జగదానంద కారకుడు.. శ్రీరాముడి విగ్రహాన్ని సోమవారం అయోధ్యలో ప్రతిష్టించడంతో హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాలు రామ నామస్మరణతో మార్మోగాయి. ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముఖ్యంగా శ్రీరాముడు, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. శ్రీరామ భక్తులు అన్ని ప్రాంతాల్లో రాముడి చిత్రపటాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఊరూవాడ అన్న తేడా లేకుండా అన్ని చోట్ల అన్నదానం, పానకాలను పంపిణీ చేశారు. బాలరాముని ప్రాణ ప్రతిష్ట పలు ఛానళ్ల ప్రత్యక్ష ప్రసారం చేయడంతో ఆ ఘట్టాన్ని అధిక సంఖ్యలో జనం తిలకించి హర్షం వ్యక్తం చేశారు. 500 ఏళ్ల నాటి కల ఫలించిందని భావోద్వేగానికి గురయ్యారు.


మడకశిర: శ్రీరాముడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం


పెనుకొండ: కోర్టు సిబ్బందికి స్వీట్లు అందజేసుకుంటున్న న్యాయవాదులు


గోరంట్ల: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


లేపాక్షి: శ్రీరామ భజన చేస్తున్న భక్తులు


హిందూపురం మండలం సడ్లపల్లిలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


చిలమత్తూరు: హోమం నిర్వహిస్తున్న పురోహితులు


అగళి: శ్రీరాముడి విగ్రహంతో నిర్వహిస్తున్న ర్యాలీలో పాల్గొన్న భక్తులు


గుడిబండ: రాములోరి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు


రొళ్ల: ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు


హిందూపురం: అన్నదానం చేస్తున్న దృశ్యం


మడకశిర మండలం జిల్లేడుగుంట ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అమరాపురం: కోలాటం ఆడుతున్న విద్యార్థినులు


సోమందేపల్లి: భోజన ప్యాకెట్లు అందజేస్తున్న మైనార్టీ నాయకులు


పావగడ: రాముడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న డ్రైవర్ల ట్రేడ్ యూనియన్ పదాధికారులు

సంక్షేమాన్ని చూసి ఓటేయండి

- ఆత్మీయ పలకరింపు యాత్రలో మంత్రి ఉషశ్రీచరణ్


పరిగి మండలంలో పర్యటిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: 'అర్హతే ప్రామాణికంగా ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి' అని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మండలంలో మూడోరోజు ఆత్మీయ పలకరింపు యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత ఊటుకూరులో సర్పంచ్ దిలీప్‌యాదవ్, ఎర్రగుంటలో సర్పంచ్ బాలకృష్ణ, హొన్నంపల్లిలో సర్పంచ్ మంజునాథ్‌రెడ్డి, విట్టాపల్లిలో స్థానిక నేతల ఆధ్వర్యంలో యాత్ర జరిగింది. ఆయా స్థానిక గ్రామాల ప్రజలు ఆమెకు బ్రహ్మరథం పట్టారు. అక్కంపల్లి, దాసరిపల్లి, బసవనపల్లి, నేతులపల్లి, ఎర్రగుంట, తిరుమలదేవరపల్లి, విట్టాపల్లి, మూడిండ్లపల్లి, హొన్నంపల్లి, కె నరసాపురం, జంగాలపల్లి గ్రామాల్లో నిర్వహించిన యాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున భాగస్వామ్యులయ్యారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

టీడీపీకి ఓటేస్తే పథకాలన్నీ ఆపేస్తారు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పెనుకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖామంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. నాడు నేడు, ఆసరా, వైఎస్సార్ క్లీనిక్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వంటి పథకాలన్నీ విద్య, వైద్య, ఆర్థిక రంగాల్లో ప్రజలకు చేరువయ్యాయన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి రూ.25 వేల కోట్లు వెచ్చించారని తెలిపారు. టీడీపీ వాళ్లకు ఓటేస్తే వందలాది పథకాలను ఆపేస్తారని, దోచుకోవడం, దాచుకోవడం వారికి కొత్తేమీ కాదని విమర్శించారు. కాగా అధిక శాతం కురుబ కులస్తులు ఉన్న నేతులపల్లిలో కన్నడలో మాట్లాడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, కాణిపాకం ఆలయ ట్రస్టు మాజీ డైరెక్టర్ మారుతీస్వామి, వైస్ ఎంపీపీ శకుంతలమ్మ, ఎంపీటీసీ సభ్యులు అమరావతి, బెస్త నాగజ్యోతి, గంగాదేవి, జేసీఎస్ కన్వీనర్ గంగాధర్ రెడ్డి, పెనుకొండ కౌన్సిలర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

పరిగి: ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? అని సాక్షాత్తు టీడీపీ అధినేత నారా చంద్రబాబు దళితులను ఉద్దేశించి కించపరిచే మాటలన్నారు. అయితే ఎస్సీలను అన్ని విధాలా ఆదుకుని, వారి ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాటలు వేశారు' అని మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. ఆత్మీక పలకరింపు యాత్రలో భాగంగా సోమవారం ఎర్రగుంటలోని ఎస్సీ కాలనీలో సర్పంచ్ బాలకృష్ణ నేతృత్వంలో ఎస్సీ సెల్ నాయకుడు నరేష్ ఆధ్వర్యంలో 28 కుటుంబాలు టీడీపీని వీడి మంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఉషశ్రీచరణ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సుజాతమ్మ, నరసక్క, అంజినమ్మ, రామాంజినమ్మ, భాగ్యమ్మ, ముద్దమ్మ, నేత్ర, మల్లక్క, కరియమ్మ, సుజాతమ్మ, సులోచనమ్మ, శివమ్మ, నందిని, పార్వతమ్మ, నాగమ్మ, లక్ష్మీనరసమ్మ, నాగమణి, ఆదిలక్ష్మమ్మ, జ్యోతి, అశ్వర్థమ్మ, వెంకటరమణప్ప తదితరులున్నారు.

రీలర్ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: పట్టు రైతులు, రీలర్లకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన రాయితీ ప్రోత్సాహక బకాయిలు మంజూరును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక అన్నారు. పట్టుగూళ్ల మార్కెట్ వద్ద పట్టు రీలర్లు, రైతులు చేపడుతున్న రిలే దీక్ష శిబిరం వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ఉరవకొండలో జరుగుతున్న బహిరంగ సభకు సీఎం జగన్ వస్తున్నారని పట్టు రైతులు, రీలర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్తామన్నారు. నిరవధిక దీక్షల కారణంగా అందరికీ ఇబ్బందేనని, దీనిపైనే ఆధారపడిన కుటుంబాల గురించి ఆలోచించి సమ్మె విరమించాలని కోరారు.

గడప గడపలో సంతోషం


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ

హిందూపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రతి గడపలోనూ సంతోషం నింపుతున్నారని హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని 1వ వార్డు కొట్నూరు సచివాలయ పరిధిలో కౌన్సిలర్ మల్లికార్జునగౌడ్ ఆధ్వర్యంలో వారు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీఎన్.దీపిక మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ 99 శాతం అమలు చేశారని గుర్తుచేశారు. హిందూపురాన్ని పట్టించుకోని ఎమ్మెల్యేగా బాలకృష్ణ చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఎన్నికలు వచ్చేసరికి హిందూపురం ప్రజలపై ఎనలేని ప్రేమ కురిపిస్తూ సినిమా డైలాగులు చెప్పి మభ్యపెట్టడానికి మరోసారి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పురం ప్రజలు భవిష్యత్తును ఆలోచించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

పేట వెంకటరమణస్వామి ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో తమవంతు సహకారం అందిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హిందూపురం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణరెడ్డిలను వారు ఘనంగా సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి అందించడానికి ఎప్పుడూ ముందుంటామని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. సోమవారం హిందూపురం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కమిటీ సభ్యులు దీపికను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నిధి కుంభ మహోత్సవం


జ్యోతులు తీసుకెళ్తున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లిలో వెలసిన ఆంజనేయస్వామికి భక్తులు సోమవారం జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజల మధ్య నిధి కుంభ మహోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో స్వామివారికి జ్యోతులను సమర్పించారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే గెలుపు


వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్ట కామప్పను కలిసిన ఈర లక్కప్ప

మడకశిర: వచ్చే ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప అన్నారు. ఆయన సోమవారం పట్టణంలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్ట కామప్పను కలిసి పార్టీ పరిస్థితిపై చర్చించారు. ఈర లక్కప్ప మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేయడానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు.

మడకశిరరూరల్: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప సోమవారం వైబీ హళ్లి పంచాయతీలో పర్యటించి వైఎస్సార్‌సీపీ నాయకులను కలిశారు. వైబీహళ్లిలో కరుణాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులను కలిసి తన సంపూర్ణ మద్దతును ప్రకటించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

వైఎస్సార్‌సీపీని గెలిపించాలి

గోరంట్ల: పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. పేదలు మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీని వచ్చే ఎన్నికల్లో మెజార్టీతో గెలిపించాలని మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లేల, రాంపురం, కాంగారెడ్డిపల్లి, చలమయ్యగారిపల్లి, చింతమానుపల్లి గ్రామల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులతో కలసి చరణ్‌రెడ్డి ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఫకృద్దీన్‌సాహెబ్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మాజీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు నూర్‌మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పోలింగ్ కేంద్రం పరిశీలన

మడకశిరరూరల్: మండల పరిధిలోని గోవిందాపురం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సోమవారం జిల్లా ఆలేస్కో, ఐఈడీ అధికారి ఆనంద్‌బాబు పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులను తక్షణం పూర్తి చేయించాలని, అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయిస్తామని హెచ్‌ఎంకు సూచించారు. అలాగే ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు.

ఎంఈఓపై సస్పెన్షన్ ఎత్తివేత

మడకశిర: మడకశిర ఎంఈఓ శ్రీనివాస భాస్కర్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం మడకశిర ఎంఈఓగా మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. ఓ కేసులో అరెస్ట్ అయిన ఎంఈఓపై 15 రోజుల క్రితం ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా నెమలి వాహనోత్సవం

పావగడ: స్థానిక నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి నెమలి వాహనోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారిని 108 లీటర్ల పాలతో అభిషేకించారు.

యువతి అదృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని కొండంపల్లికి చెందిన అనూషాబాయి (20) అదృశ్యమైనట్లు ఆమె తండ్రి హనుమంతనాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

